క్లుప్తంగా...

మంత్రి తలసానికి శుభాకాంక్షలు



చార్మినార్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సనత్‌నగర్ నుంచి పోటీ చేయడానికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ లభించడంపై హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధుల బృందం గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, హన్స్‌రాజ్, వినయ్, శ్రీధర్ తదితరుల బృందం ఆయనను కలిసి బొకే అందజేసి ఈసారి కూడా భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని తెలిపారు.

కార్వాన్ కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తులు



టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

గోల్కొండ: కార్వాన్ అసెంబ్లీ టికెట్ కోసం కాంగ్రెస్ నాయకులు గురువారం దరఖాస్తులు చేసుకున్నారు. గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు పురకుల కృష్ణ, ముంగి రఘుపాల్ రెడ్డి తదితరులు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యాలయ ఇన్‌చార్జికి తమ దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో నేడు కాంగ్రెస్ బలంగా ఉందన్నారు. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లతో పాటు మజ్లిస్ సిట్టింగ్ ఎమ్మెల్యే వ్యతిరేక ఓట్లు కూడా తమకే వస్తాయని దీమా వ్యక్తం చేశారు.

మాణిక్‌రావుకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకటేష్, చంద్రమోహన్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్‌ను దళిత నేత మాణిక్‌రావుకు కేటాయించాలని గోషామహల్ అరుందతి సేవా మండలి వైస్ ప్రెసిడెంట్‌లు డి.వెంకటేష్, చంద్రమోహన్ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గోషామహల్‌లో మాణిక్‌రావు 30 ఏళ్ల నుంచి రాజకీయంగా దళితులతో పాటు అన్నివర్గాల ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. దళితుల ప్రగతికి, సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్న మాణిక్‌రావుకు టికెట్ ఇస్తే తప్పక గెలిపిస్తామని వారన్నారు. ఎం.బాల్‌రాజ్, డి.నాగేశ్వర్, పి.వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

చార్మినార్: రాష్ట్రంలో ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల మీద, వైన్స్ షాపుల టెండర్ల మీద ఉన్న శ్రద్ధ విద్యారంగ సమస్యలపై మీద లేదని ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సబావట్ కల్యాణ్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు చార్మినార్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కల్యాణ్ మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని.. తెలంగాణలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎంతో మంది ప్రాణత్యాగం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అలాంటి తెలంగాణలో నీళ్లు కేసీఆర్ ఫాంహౌస్‌కు, నిధులు కేసీఆర్ ఇంట్లోకి, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కాయని మండిపడ్డారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సజన్, నగర కార్యదర్శి సందీప్, విష్ణు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీకాంత్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్, రేఖ, భావ్య, విఘ్నేశ్, సాకేత్, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

సీబీఐటీలో ముగిసిన సదస్సు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ, ఎనర్జీ ప్రాక్టీషనర్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ క్లీన్ ఎనర్జీపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా టీఎస్ఆర్ఈడీసీఓ వైస్ చైర్మెన్, ఎండీ ఎన్. జానయ్య పాల్గొన్నారు. ఆధునిక సోలార్ పీవీ మాడ్యూల్, సాంకేతికతల, సోలార్ ఎనర్జీలో సవాళ్లు అవకాశాలపై చర్చించారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అధికారి, సహాయ డైరెక్టర్ కె.శివరామ ప్రసాద్, ఎస్ఈపీఏ ఉపాధ్యక్షుడు కిషోర్ భువరాఘ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవం



ర్యాలీలో మహేష్ అగర్వాల్, డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్

అబిడ్స్: చంద్రయాన్-3 మిషన్ రక్షణరంగ సంస్థ మిదాని కీలక పాత్ర పోషించిందని ఈ విజయం చిరస్మరణీయంగా ఉంటుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ అగర్వాల్ పేర్కొన్నారు. సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వనిత మహా విద్యాలయ ఎన్‌సీసీ యూనిట్ విద్యార్థులతో కలిసి గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ..చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలకు భారత్ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయంతో భారత ప్రజలంతా గర్వపడ్డారన్నారు. డాక్టర్ రవితేజ, హైకోర్టు న్యాయవాది ధనుంజయ, సుప్రియ, కాస్మోని శ్యామ్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.

మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో..

చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ కావడంతో పలువురు చిన్నారులు విజయోత్సవం నిర్వహించారు. సంఘసేవకుడు, రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో చిన్నారులు జాతీయ జెండాలు ఎగరవేస్తూ ఆనందంతో కేరింతలు కొట్టారు.

మదీనా సర్కిల్‌లో..

చార్మినార్: చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ కావడంపై పాతబస్తీలో బుధవారం రాత్రి నుంచి సంబరాలు మిన్నంటాయి. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ (ఎంసీఎం) మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ ఆధ్వర్యంలో మదీనా చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి మువ్వన్నెల జెండాలను ప్రదర్శించారు.

దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో...

చంద్రయాన్-3 విజయం కావడం పట్ల దక్షిణ మండలం పోలీసులు బుధవారం రాత్రి చార్మినార్ కట్టడం వద్ద మువ్వన్నెల జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్‌తో పాటు చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.



విజయోత్సవంలో పలువురు చిన్నారులు



మదీనా సర్కిల్ వద్ద ఎంసీఎం ఆధ్వర్యంలో..



మువ్వన్నెల జెండాలతో చార్మినార్ కట్టడం వద్ద దక్షిణ మండలం పోలీసుల ప్రదర్శన

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకోని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలకు మజ్లిస్‌పార్టీ కట్టుబడి ఉండి హామీలను నెరవేరుస్తుందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఇప్పటికే తాను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేయించడం జరిగిందని తెలిపారు. ఈ వర్షాకాలంలో నియోజకవర్గంలోని ఒక్కబస్తీ కూడా ముంపునకు గురి కాలేదని ఆయన అన్నారు. నానల్‌నగర్, టోలిచౌకి, లంగర్‌హౌజ్ తదితర డివిజన్లలో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని ఈ పనుల కారణంగా ఆయా ప్రాంతాలు ముంపుకు గురికాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, బేగ్, సయ్యద్ జబ్బార్, జాకేర్ తదితరులున్నారు.

గుడిమల్కాపూర్‌లో ఓటరు నమోదు



ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు అమర్‌సింగ్

గోల్కొండ: ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం నెంబర్ వన్‌గా ఎదిగిందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఆయన పర్యటించి ఆయా ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయం బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ సమర్థతకు చిహ్నమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్‌కుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో మహిళల పాత్ర కీలకం

గోల్కొండ: కాంగ్రెస్‌లో మహిళలది కీలక పాత్ర అని టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. కార్వాన్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులుగా నియమితులైన వారికి గురువారం ఆమె నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల్లో మహిళల పాత్రను శక్తివంతం చేసింది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని ఆమె అన్నారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ దీనికి నిదర్శనమన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె అన్నారు. కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉషా తదితరులున్నారు.

సన్మానం



హోం మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు రాంరెడ్డి, సుందర్ రెడ్డి

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు ముప్పిడి సీతారాంరెడ్డి, సామ సుందర్ రెడ్డి కుటుంబ సమేతంగా గురువారం హోం మంత్రి మహమూద్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కార్యాలయంలో శాలువా కప్పి సన్మానం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా తమ పేర్లు ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యం

విజయనగర్‌కాలనీ: బాలిక అదృశ్యమైన ఘటన గురువారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ మిలన్‌టాకీస్ వద్ద నివసించే ఎంఏ.మాజీద్ ఫాతిమా(17)ను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ఫోన్‌లో పదే పదే మాట్లాడుతుండడంతో మందలించడంతో సంవత్సరం క్రితం ఇంటి నుంచి బయటకి వెళ్లింది. అనంతరం పోలీసులు కౌన్సెలింగ్‌తో నింబ్లో అడ్డలోని హోంలో ఉంచారు. అనారోగ్యానికి గురికావడంతో ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య చికిత్సలు చేయించారు. అనంతరం ఇంటికి వచ్చి ఉంది. ఈనెల 20న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధుమిత్రుల వద్ద వాకాబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాపారపరమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ కమిషనర్ సుబ్బారావు

గన్‌ఫౌండ్రీ: ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ జీఎస్టీ విధానంతో పాటు ఇతర వ్యాపారపరమైన చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యూనల్ శాఖ సభ్యురాలు కె.సీతాలక్ష్మి అన్నారు. ఈ మేరకు గురువారం గన్‌ఫౌండ్రీలోని తెలంగాణ రాష్ట్ర ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ 20వ వార్షిక కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ నిజాయితీతో అందిస్తున్న సేవలు దేశ ఆర్థిక పురోగాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అంతకు ముందు ఆదాయపన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ సుబ్బారావు, నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అసోయేషన్ అధ్యక్షులుగా కె.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.గోపాల్, కోశాధికారి కె.హుస్సేన్, ఉపాధ్యక్షులు కేవీ.రమణమూర్తి, దుర్గాప్రసాద్ సంయుక్త కార్యదర్శులు జి.నాగరాజు, వి.వెంకటరమణ ఎన్నికయ్యారు.

మెట్రోరైలు పనులను ప్రారంభించండి



చార్మినార్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పాతనగరంలో మెట్రో రైలు పనులను తక్షణమే ప్రారంభించాలని ఓల్డ్‌సిటీ మెట్రో రైలు జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్ బేగంపేట్ హైదరాబాద్ మెట్రో రైలు కార్పొరేట్ కార్యాలయంలో గురువారం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డిను కలిసి ఓల్డ్‌సిటీ మెట్రో రైలు జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్య నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కువ జన సాంద్రతతో ఉన్న పాతబస్తీలో ప్రతిరోజూ దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మెట్రో రైలు పెద్ద ఊరటనిస్తుందని.. పాతబస్తీ అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుదన్నారు. నర్సింహ, ఉస్మాన్ హల్ హజారీ, వెంకటేశ్, మూసా ఖాసీం, ఛాయదేవి, యాదగిరి పాల్గొన్నారు.

ముజీబ్ హుస్సేనికి పురస్కార ప్రదానం



ముజీబ్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ఎస్.వేణుగోపాల చారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేనికి ది లీడర్ వెల్ఫేర్ ఎంకోరర్ బిరుదును ప్రదానం చేశారు. గురువారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రాజ్ఞిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గాయని గాయకుల దేశభక్తి గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావు, ప్రాజ్ఞిక వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఆనంద్‌గుప్తా



దూద్‌బౌలి: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ సీనియర్ నాయకుడు ధోరేటి ఆనంద్ గుప్తా అన్నారు. గురువారం ఆయనను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీకి అత్యధిక సంఖ్యలో యువత మద్దతు ఉందని.. అన్ని వర్గాల మద్దతుతో తెలంగాణలో బీజేపీ పుంజుకుంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బహదూర్‌పురా: ప్రభుత్వ ఓల్డ్ సిటీ ఐటీఐలో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రేణుక సూచించారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఓల్డ్‌సిటీ ఐటీఐ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. మెకానిక్, మోటార్ వెహికిల్, డిజిల్ మెకానిక్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్స్, ప్లంబర్, కటింగ్ అండ్ సివింగ్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా



మహ్మద్ సలావుద్దీన్ లోధిని సత్కరిస్తున్న చార్మినార్ బీఆర్ఎస్ నేతలు

చార్మినార్: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా మహ్మద్ సలావుద్దీన్ లోధి అన్నారు. గురువారం పురానీహవేలిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ తనకు రెండోసారి పార్టీ టికెట్ కేటాయించిందన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. సయ్యద్ మహ్మద్ అహ్మద్, మహ్మద్ అమేర్, రవీశ్వర్, మెహజబీన్ ఖురేషి, బి.దాస్, శ్రీరాం, సయ్యద్ అజీముద్దీన్, మహ్మద్ ఫారూఖ్ పాల్గొన్నారు.

సన్మానం



ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు, ధర్మతేజలను సన్మానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు మహర్షిస్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల భారత ప్రభుత్వ కమిటీ సభ్యులుగా తెలంగాణ రాష్ట్రం నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు, ఏపీ, తెలంగాణ ఆర్య సమాజ్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ధర్మతేజను భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పండిట్ గంగారామ్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సుల్తాన్‌బజార్‌లోని ఆర్యకన్య విద్యాలయ హైస్కూల్‌లో ప్రొఫెసర్ బి.జగదీశ్వర్‌రావు, ధర్మతేజను సన్మానించారు. భక్తారామ్, కార్యదర్శి శశికాంత్ భారతి, మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరు నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో పాండుయాదవ్, లక్ష్మీనారాయణ తదితరులు

జియాగూడ: అర్హులందరూ ఓటరు నమోదు చేసుకోవాలని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్, బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నందకర్, కార్వాన్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ అమర్‌సింగ్ అన్నారు. ఈ మేరకు గురువారం భగత్‌సింగ్ చౌరస్తాలో డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు రాజ్‌పోల్, ప్రధాన కార్యదర్శి దొర్తుల నరేష్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శివకుమార్‌యాదవ్, వెంకటేష్ యాదవ్, మనీష్ జైన్, జగదీష్, దుర్గేష్, రామ్, బాబు, మహేష్, వివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న మదన్‌మోహన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మలకు సామాజిక, ఆర్థిక రాజకీయాల రంగాల్లో మొండి చెయ్యి చూపుతున్నారని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్ అన్నారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయా పార్టీలు విశ్వబ్రాహ్మణులకు సముచిత ప్రాధాన్యతను కల్పిస్తూ టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల అభ్యున్నతి కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయకుండా కేవలం ప్రకటనలు చేసి మోసం చేశారని ధ్వజమెత్తారు. విశ్వబ్రాహ్మణులకు టికెట్లు కేటాయించిన రాజకీయ పార్టీకి తాము అండగా ఉండి తమ సత్తాను నిరూపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్‌కు నిర్మల్‌కుమార్ యాదవ్ దరఖాస్తు



అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర నాయకుడు నిర్మల్‌కుమార్‌యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆయన తన దరఖాస్తును అందజేశారు. శ్యామ్‌సింగ్, డీఎస్.యాదవ్, శంకర్‌సింగ్, హరిచంద్ యాదవ్, రాజీవ్ పండిట్, రఘునందన్ యాదవ్, నాగభూషణం, మధు, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తిని హరినాథ్‌గౌడ్ మృతిపట్ల సంతాపం

అబిడ్స్: బత్తిని హరినాథ్ గౌడ్ మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కోట్లాది మందికి చేపప్రసాదాన్ని వంపిణీ చేసి ఆరోగ్య దైవంగా మిగిలారని ఎగ్జిబిషన్ సొసైటీ సీనియర్ ప్రతినిధులు వనం వీరేందర్, అశ్వినిమార్గం, వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, ప్రభాశంకర్, సుఖేష్‌రెడ్డి, ఆదిత్యమార్గం, సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. హరినాథ్‌గౌడ్ మృతి కోట్లాదిమందికి తీరనిలోటు అని వారు ఆయన మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

చోరీకి యత్నించిన ఆటో డ్రైవర్‌కు జైలు

గోల్కొండ: అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతూ ఓ దుకాణంలోకి దొంగతనం చేసేనిమిత్తం వెళ్లేందుకు యత్నించి పోలీసులకు పట్టుబడ్డ నిందితుడికి నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు పది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... హకీంపేటకు చెందిన ఇమ్రాన్‌ఖాన్(25) ఆటో డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా రాత్రిపూట షేక్‌పేట, గోల్కొండ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు నిఘా ఉంచారు. రెండు రోజుల క్రితం షేక్‌పేటలోని ఓ హార్డ్‌వేర్ షాపులోకి దూరేందుకు యత్నిస్తుండగా అప్పటికే అక్కడ పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గుర్తించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఈ-పెట్టి కేసు నమోదు చేసి గురువారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇద్దరికి జైలు శిక్ష

డబీర్‌పురా: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తికి గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్. లక్ష్మణ్ రావు 20 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాకుత్‌పురా మాతాకి కిడికి ప్రాంతానికి చెందిన మహ్మద్ ముఖరం అలీ (40) అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. దీంతో ముఖరం అలీపై ఈ-పెట్టీ కేసునమోదు చేసుకొని గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా.. మెజిస్ట్రేట్ 20 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మరో కేసులో బండ్లగూడ రియాస్‌నగర్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహ్మద్ అహ్మద్ (28) స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. అనంతరం మహ్మద్ అహ్మద్‌ను గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.